క్లుప్తంగా

ఆర్థికసాయం అందజేత



ఆర్థికసాయం అందజేస్తున్న పటేల్ రమేష్‌రెడ్డి

భానుపురి (సూర్యాపేట) : కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ నాయకుడు కట్టికోల శ్రీమన్నారాయణ బ్రెయిన్ స్ట్రోక్‌తో సూర్యాపేట ఏరియా ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. విషయం తెలుసుకున్న తెలంగాణ పర్యాటక అభివృద్ధి కార్పొరేషన్ చైర్మన్ పటేల్ రమేష్‌రెడ్డి గురువారం బాధిత కుటుంబాన్ని పరామర్శించి వైద్య ఖర్చు నిమిత్తం రూ.1.50 లక్షల ఆర్థిక సాయం అందించారు. ఆయన వెంట సూర్యాపేట వ్యవసాయ మార్కెట్ వైస్‌చైర్మన్ గట్టు శ్రీనివాస్, మాజీ కౌన్సిలర్ వెలుగు వెంకన్న, వల్దాసు దేవేందర్, తండు శ్రీనివాస్, పిల్లల రమేష్‌నాయుడు, పాలగాని కృష్ణ, యాట వెంకన్న, సైదిరెడ్డి, అరవింద్‌రెడ్డి, యాట ఉపేందర్, అంజయ్య తదితరులు ఉన్నారు.

పాఠశాలకు క్రీడా సామగ్రి బహూకరణ



పాఠశాలకు క్రీడా సామగ్రిని బహూకరిస్తున్న ఎంఎన్‌ఓ ప్రభాకర్

అర్వపల్లి : ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధికి దాతలు సహకరించాలని మండల నోడల్ అధికారి కుంభం ప్రభాకర్ కోరారు. అర్వపల్లిలోని జెడ్పీహెచ్ఎస్‌కు ఆయన సొంత ఖర్చులతో గురువారం వాలీబాల్స్, తదితర క్రీడా సామగ్రిని బహూకరించారు. క్రీడల్లో పిల్లలు రాణించాలని సూచించారు. అనంతరం పాఠశాలను తనిఖీ చేశారు. ఆగస్టు 15నాటికి 6 నుంచి 9వ తరగతి విద్యార్థులందరికి చదవడం, రాయడం రావాలన్నారు. కార్యక్రమంలో హెచ్ఎం ఎం.విజయలక్ష్మి, ఉపాధ్యాయులు, శ్రీదేవి, మధుకర్, విమల, శ్రీరాములు, రమేష్, ప్రసన్న, పుష్పలత, స్వర్ణలత, వీరన్న, నాగన్న, అంజలి, సునంద, పాఠశాల పీడీ, తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ ప్రభుత్వం మహిళల పక్షపాతి

అర్వపల్లి : కాంగ్రెస్ ప్రభుత్వం మహిళల పక్షపాతిగా పనిచేస్తూ వారి సంక్షేమం కోసం ఎంతో కృషి చేస్తుందని మహిళా కాంగ్రెస్ రాష్ట్ర ఉపాధ్యక్షురాలు డాక్టర్ బోయలపల్లి రేఖ అన్నారు. గురువారం మండలంలోని అడివెంల గ్రామంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడారు. ఈ నెల 14నుంచి రాష్ట్రవ్యాప్తంగా మహిళలకు రేషన్‌కార్డులు పంపిణీ చేయనున్నట్లు తెలిపారు. ముఖ్యంగా తుంగతుర్తి నియోజకవర్గం నుంచే రేషన్ కార్డుల పంపిణీని సీఎం రేవంత్‌రెడ్డి ప్రారంభించడం ఈ ప్రాంత ప్రజలకు గర్వకారణమన్నారు. ఆమె వెంట మాజీ సర్పంచ్ మడ్డి పద్మ, ఉప్పలయ్య, నాగరాజు, వెంకన్న, లతీఫ్, శేఖర్ తదితరులు ఉన్నారు.

కేజీబీవీలో ఇంటర్ తరగతులు ప్రారంభం



తరగతులను పరిశీలిస్తున్న ఎస్‌ఓ నాగరాణి

అర్వపల్లి : అర్వపల్లిలోని కేజీబీవీలో గురువారం ఇంటర్ తరగతులు ప్రారంభించినట్లు ఎస్‌ఓ నాగరాణి తెలిపారు. ఈ సందర్భంగా ఆమె ఇంటర్ మొదటి సంవత్సరం తరగతులను పరిశీలించి మాట్లాడారు. ఇక్కడి కేజీబీవీని ఇంటర్ కళాశాలగా ఈ ఏడాది అప్‌గ్రేడ్ చేసినట్లు తెలిపారు. ఈసారి మొదటి సంవత్సరం ప్రారంభించామని, ఈ మొదటి సంవత్సరంలో ఎంపీసీ, బైపీసీ రెండు గ్రూపులకు గాను 80సీట్లు ఉండగా 40సీట్లు భర్తీ అయ్యాయని తెలిపారు. మిగిలిన 40 ఖాళీగా ఉన్నాయని పదోతరగతి పూర్తిచేసిన అర్హులైన బాలికలు చేరాలని కోరారు. ఇంటర్ విద్యాబోధనకు అన్ని సబ్జెక్టులకు సంబంధించిన అధ్యాపకులను నియమించామని పేర్కొన్నారు. ఆమె వెంట అధ్యాపకులు ఉన్నారు.

పారిశుద్ధ్య పనుల పరిశీలన

అర్వపల్లి : సీజనల్ వ్యాధుల దృష్ట్యా ప్రజలు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని జాజిరెడ్డిగూడెం ఉమ్మడి మండల పీఏసీఎస్ చైర్మన్ కుంట్ల సురేందర్‌రెడ్డి కోరారు. గురువారం మండలంలోని కొమ్మాల గ్రామంలో ఆయన పారిశుద్ధ్య పనులను పరిశీలించారు. అన్ని వీధులు తిరిగి కాల్వలు, వీధులను శుభ్రం చేయించారు. పరిసరాల, వ్యక్తిగత పరిశుభ్రత ప్రతిఒక్కరూ పాటించాలని సూచించారు. కార్యక్రమంలో నాయకులు కుంట్ల శ్రీనివాస్‌రెడ్డి, మాదం వీరారెడ్డి, శిగ రంజిత్, మల్లారెడ్డి, శ్రీరాములు, వెంకన్న, గ్రామపంచాయతీ కార్మికులు యల్లయ్య, వీరయ్య, వీరమల్లు తదితరులు పాల్గొన్నారు.

ప్లాస్టిక్ నిషేధం అమలేదీ?

- పట్టణాల్లో యథేచ్ఛగా వినియోగం
- కాగితాలకే పరిమితమవుతున్న ఆదేశాలు
- తమకేమీ పట్టనట్లు వ్యవహరిస్తున్న అధికారులు

సూర్యాపేట అర్బన్ : పట్టణాల్లో ప్లాస్టిక్ కవర్ల నిషేధం కాగితాలకే పరిమితమైంది. ఆదేశాలు వచ్చినప్పుడే స్పందించే అధికారులు ఆ తర్వాత పట్టించుకునే వారే కరువవుతున్నారు. చిరు వ్యాపారుల నుంచి పెద్ద దుకాణాల వరకు యథేచ్ఛగా ప్లాస్టిక్ కవర్లు వినియోగిస్తున్నా అధికారులు తమకేమీ పట్టనట్లు వ్యవహరిస్తున్నారని ఆరోపణలు వినిపిస్తున్నాయి. జూన్ 2వతేదీ నుంచి మున్సిపాలిటీలో వందరోజుల ప్రణాళిక అమలవుతుంది. పారిశుద్ధ్య నిర్వహణతో పాటు ప్లాస్టిక్ కవర్ల వాడకంపై తనిఖీలు నిర్వహించాలని ఆదేశాలు ఉన్నాయి. ఈ నేపథ్యంలో పూర్తిస్థాయిలో చర్యలు తీసుకుంటేనే ప్లాస్టిక్ కవర్ల నిషేధం పూర్తిస్థాయిలో అమలులో ఉంటుంది.

రెండేళ్ల కిందట ఆదేశాలు..

ప్లాస్టిక్ కవర్లను నిషేధం పకడ్బందీగా అమలు చేయాలని రెండేళ్ల కిందటే ప్రభుత్వం ఆదేశించింది.



బాలెంల డంపింగ్‌యార్డులో గుట్టలుగుట్టలుగా ఉన్న ప్లాస్టిక్ కవర్లు

దీంతో మున్సిపాలిటీల్లో ఆదేశాలు వచ్చినప్పటికీ ఆరు నెలల పాటు తనిఖీలు చేసి కట్టడి చేశారు. అనంతరం తగ్గించడంతో పరిస్థితి మళ్లీ మొదటికి వచ్చింది.

తాజా ఉత్తర్వుల ప్రకారం..

పాలిథిన్ కవర్ల వినియోగంపై తాజాగా వచ్చిన ఉత్తర్వుల ప్రకారం 120 మైక్రాన్ల కంటే మందం తక్కువగా ఉన్న ప్లాస్టిక్ విక్రయించినా, ఉపయోగించినా పర్యావరణ ప్రొటెక్షన్ యాక్ట్ 1986 ప్రకారం సీడీఎంఏ ఆదేశాల మేరకు సామగ్రి జప్తుతో పాటు రూ.వెయ్యి నుంచి రూ.10వేల వరకు జరిమానా విధిస్తారు. రెండోసారి పట్టుపడితే లైసెన్స్ రద్దుతో పాటు చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటారు.

క్లాత్ సంచులను ప్రోత్సహించాలి..

మహిళా సంఘాలకు క్లాత్ సంచుల తయారీపై శిక్షణ ఇప్పించి వాటిని వ్యాపారులకు వికయించేలా పురపాలికలు ఆదేశాలు జారీ చేయాలి. అదే విధంగా అధికారులు కూడా చర్యలు తీసుకోవాలి. దీంతో మహిళలు ఆర్థికంగా అభివృద్ధి చెందడంతో పాటు కవర్లను వాడకుండా అడ్డుకట్ట వేయవచ్చు.

పకడ్బందీగా అమలు చేస్తాం



మున్సిపాలిటీలో ఎక్కడా కూడా నిషేధిత ప్లాస్టిక్ కవర్లు వాడొద్దు. పట్టణంలో తనిఖీలు చేయాలని అధికారులకు సూచించాం. ముందు వారికి నోటీసులు జారీ చేస్తాము ప్లాస్టిక్ పట్టుబడితే జరిమానా విధిస్తాం. ప్రజలు విధిగా తాము ప్లాస్టిక్ కవర్లను వాడమని ప్రతిజ్ఞ చేయాలి. ప్రజలకు ప్లాస్టిక్ కవర్ల నిషేధంపై అవగాహన కల్పిస్తాం.

– హన్మంతరెడ్డి, మున్సిపల్ కమిషనర్

సీఎం సభను విజయవంతం చేయాలి

- ఎమ్మెల్యే సామేల్

తిరుమలగిరి : నూతన రేషన్‌కార్డుల పంపిణీ కార్యక్రమంలో భాగంగా ఈ నెల 14న పట్టణంలో నిర్వహించనున్న సీఎం రేవంత్‌రెడ్డి బహిరంగ సభను విజయవంతం చేయాలని ఎమ్మెల్యే మందుల సామేల్ కోరారు. గురువారం స్థానికంగా బహిరంగ సభ ఏర్పాటు స్థలాన్ని అధికారులతో కలిసి పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడారు. రాష్ట్ర వ్యాప్తంగా నూతనంగా 2లక్షలకు పైగా నూతన రేషన్‌కార్డులను ప్రభుత్వం అందిస్తున్నట్లు తెలిపారు. దేశంలో ఎక్కడా లేని విధంగా కాంగ్రెస్ ప్రభుత్వం సీఎం రేవంత్‌రెడ్డి సన్న బియ్యాన్ని అందిస్తున్నారని అన్నారు. సీఎం తుంగతుర్తి నియోజకవర్గానికి అధిక నిధులు కేటాయించినట్లు తెలిపారు. అదే విధంగా నూతనంగా ప్రభుత్వ జూనియర్ కళాశాల భవనానికి శంకుస్థాపన చేయనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఆర్డీఓ వేణుమాధవరావు, డీఎస్పీ ప్రసన్నకుమార్, కాంగ్రెస్ జిల్లా అధికార ప్రతినిధి సంకెపల్లి కొండల్ రెడ్డి, పార్టీ మండల అధ్యక్షుడు వై.నరేష్, జమ్మిలాల్, వీరేష్, అశోక్‌రెడ్డి, అంబేడ్కర్, సుధాకర్, తహసీల్దార్ హరిప్రసాద్, సీఐ నాగేశ్వరరావు ఉన్నారు.



సీఎం సభ ఏర్పాట్లపై అధికారులతో చర్చిస్తున్న ఎమ్మెల్యే మందుల సామేల్

శ్రమ దోపిడీకి గురవుతున్న మహిళలు



మాట్లాడుతున్న జంపాల స్వరాజ్యం

సూర్యాపేట అర్బన్ : పురుషులతో సమానంగా పనిచేస్తున్న మహిళలు తక్కువ కూలితో శ్రమ దోపిడీకి గురవుతున్నారని, వారికి పురుషులతో పాటు సమానంగా కూలి ఇవ్వాలని తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం మహిళా కూలీల జిల్లా కన్వీనర్ జంపాల స్వరాజ్యం అన్నారు. గురువారం పట్టణంలోని వాణిజ్య భవన్ సెంటర్‌లో అడ్డ కూలీలు ఎదుర్కొంటున్న సమస్యలపై ఆమె సర్వే నిర్వహించి మాట్లాడారు. గ్రామీణ ప్రాంతంలో వ్యవసాయ పనులు దొరక్క అనేక మంది పట్టణంలో అడ్డ కూలీలుగా జీవిస్తున్నారని, భవన నిర్మాణ పనులకు వెళ్తున్న మహిళలకు కూలి ఇచ్చే దగ్గర పురుషులతో సమానంగా ఇవ్వకుండా కేవలం రూ.600 మాత్రమే ఇస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. పురుషులకు రూ.800 నుంచి రూ.900వరకు ఇస్తున్నారని అన్నారు. మహిళా కూలీలకు పనిప్రదేశంలో లైంగిక వేధింపులు రోజురోజుకు పెరుగుతున్నాయన్నారు. కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న వ్యవసాయ కార్మిక వ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా ఈ నెల 9న జరిగే సార్వత్రిక సమ్మెలో కార్మికులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి మట్టిపల్లి సైదులు, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా సహాయ కార్యదర్శి బెల్లంకొండ వెంకటేశ్వర్లు, కూలీలు పద్మ, రాణి, ఎల్లమ్మ, కౌసల్య, రాములమ్మ, జ్యోతి, వెంకటమ్మ తదితరులు పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణకు ప్లాస్టిక్ నిషేధించాలి

సూర్యాపేట అర్బన్ : పర్యావరణ పరిరక్షణలో భాగంగా ప్లాస్టిక్ వాడకాన్ని నిషేధించాలని, ప్రత్యామ్నాయంగా క్లాత్ సంచులను వినియోగించాలని మున్సిపల్ కమిషనర్ సీహెచ్.హన్మంతరెడ్డి అన్నారు. అంతర్జాతీయ ప్లాస్టిక్ సంచుల నివారణ దినోత్సవం సందర్భంగా గురువారం పట్టణంలోని తాళ్లగడ్డ 29వ వార్డులో 100రోజుల ప్రణాళికలో భాగంగా చేతి సంచి పర్యావరణానికి మంచిపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చేతి సంచులను పంపిణీ చేసి మాట్లాడారు. ప్లాస్టిక్ భయంకరమైన వాతావరణ ముప్పుగా మారిందని, ప్రతిఒక్కరూ జాగ్రత్తలు వహించాలన్నారు. పట్టణ ప్రజలు ప్లాస్టిక్ నిషేధానికి సహకరించాలని కోరారు. అనంతరం పర్యావరణంపై కృషి చేస్తున్న గ్రీన్ క్లబ్ ట్రస్ట్ వ్యవస్థాపకుడు ముప్పారపు నరేందర్, సూర్యాపేట టెరస్ గార్డెన్ అసోసియేషన్ నిర్వాహకులు నల్లపాటి మమతా శ్రీకాంత్‌ను సన్మానించారు. కార్యక్రమంలో డీఈఈ సత్యారావు, శానిటరీ ఇన్‌స్పెక్టర్ సారగండ్ల శ్రీనివాస్, ఎన్విరాన్మెంట్ ఇంజనీర్ శివప్రసాద్, టీఎంసీ శ్వేత, మాజీ కౌన్సిలర్ అనంతుల యాదగిరి, మిరియాల వెంకటేశ్వర్లు, జవాన్ వేణు, ఆర్పీలు మహిళా పొదుపు సంఘాలు పాల్గొన్నారు.



క్లాత్ బ్యాగులను పంపిణీ చేస్తున్న మున్సిపల్ కమిషనర్ హన్మంతరెడ్డి

దీక్షను విజయవంతం చేయాలి

తుంగతుర్తి : హైదరాబాద్‌లోని తెలంగాణ అమరవీరుల స్థూపం (గన్‌పార్క్) వద్ద మలిదశ తెలంగాణ ఉద్యమకారుల సంక్షేమ సంఘం రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో ఈ నెల 5న ఉదయం 10 గంటలకు దీక్ష చేపట్టనున్నట్లు సంఘం మండల అధ్యక్షుడు ఉప్పుల నాగమల్లు అన్నారు. గురువారం మండల కేంద్రంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. తెలంగాణ ఉద్యమకారులు, విద్యావంతులు, మేధావులు, నిరుద్యోగులు, విద్యార్థులు, తెలంగాణ సానుభూతిపారుల నుంచి మద్దతు కోరుతున్నట్లు తెలిపారు. నాటి నుంచి నేటి వరకు ప్రభుత్వాలు తెలంగాణ ఉద్యమకారులను విస్మరిస్తూనే ఉన్నాయన్నారు. ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం ఉద్యమకారులకు హామీలిచ్చి గద్దెనెక్కి కాలయాపన చేస్తుందన్నారు.

నూతనకల్ : హైదరాబాద్‌లోని గన్‌పార్క్ వద్ద శనివారం నిర్వహించే దీక్షను విజయవంతం చేయాలని తెలంగాణ మలిదశ ఉద్యమకారుల సంక్షేమ సంఘం నియోజకవర్గ ఉపాధ్యక్షుడు గడ్డం యాదగిరి కోరారు. గురువారం మండల కేంద్రంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. తెలంగాణ రాష్ట్ర సాధన కోసం నిర్వహించిన మలిదశ ఉద్యమంలో పాల్గొన్న వారికి కాంగ్రెస్ ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను నెరవేర్చాలని కోరుతూ దీక్ష నిర్వహిస్తున్నట్లు, ఈ కార్యక్రమానికి ఉద్యమకారులు హాజరు కావాలని ఆయన కోరారు. సమావేశంలో తెలంగాణ మలిదశ ఉద్యమ నాయకులు పంతం యాకయ్య, మద్దెల సురేందర్ తదితరులు పాల్గొన్నారు.

నేడు దేవాలయ భూముల కౌలుకు వేలం

నూతనకల్ : మండల పరిధిలోని మిర్యాల గ్రామంలో గల శ్రీసీతారామచంద్రస్వామి ఆలయ భూములు కౌలుకు సంబంధించి శుక్రవారం వేలం పాట నిర్వహించనున్నట్లు తహసీల్దార్ ఎం. శ్రీనివాసరావు తెలిపారు. గురువారం తహసీల్దార్ కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఏప్రిల్ నెలలో వేలం పాట నిర్వహించగా ప్రభుత్వం నిబంధనల మేరకు వేలం తక్కువకు దక్కించుకోవడంతో కలెక్టర్ ఆదేశాల మేరకు తిరిగి వేలం నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు. వేలం పాటలో ఆసక్తి ఉన్న రైతులు పాల్గొనాలని ఆయన కోరారు. సమావేశంలో దేవాదాయ శాఖ అధికారి కుశలయ్య తదితరులు పాల్గొన్నారు.

పీఏసీఎస్ సీఈఓపై దాడి సరికాదు



మాట్లాడుతున్న చైర్‌పర్సన్, వైస్‌చైర్మన్

అర్వపల్లి : మండలంలోని తిమ్మాపురం పీఏసీఎస్ సీఈఓ ఊర సత్యనారాయణ, సిబ్బంది ఎల్గూరు వెంకన్నపై దాడికి పాల్పడడం సరికాదని పీఏసీఎస్ చైర్‌పర్సన్ మారిపెద్ది మంగమ్మ, వైస్ చైర్మన్ కొణతం స్టాలిన్‌రెడ్డి అన్నారు. గురువారం పీఏసీఎస్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడారు. ఈ నెల 1న పీఏసీఎస్‌లో రైతులకు సీఈఓ సత్యనారాయణ, సిబ్బంది వెంకన్న ఎరువులు పంపిణీ చేస్తుండగా డీసీఎంఎస్ దుకాణ యజమాని జితేందర్‌రెడ్డి అకారణంగా దాడి చేసి గాయపర్చారని, 30ఏళ్లుగా పీఏసీఎస్‌లో ఎంతో నిజాయితీగా పనిచేస్తున్న సీఈఓపై దాడి చేయడం సమంజసం కాదన్నారు. సమావేశంలో పీఏసీఎస్ డైరెక్టర్లు చల్లా వేణుధర్‌రెడ్డి, ఎం.మలయ్య, బి.సుజాత, జె.రాంబాయమ్మ, రైతులు సందీప్, అమరేందర్, బొందమ్మ, నాగయ్య, సత్యనారాయణ, మధుసూధన్, శ్రీను, లక్ష్మయ్య, స్వామి, నర్సయ్య పాల్గొన్నారు.

వానరానికి అంత్యక్రియలు

ఆత్మకూర్ (ఎస్) : మండలంలోని ఇస్తాళపురంలో అనారోగ్యంతో మృతి చెందిన వానరానికి గ్రామ పంచాయతీ సిబ్బంది గురువారం అంత్యక్రియలు నిర్వహించారు. వానరం అనారోగ్యంతో మృతి చెందగా స్థానికులు పంచాయతీ సిబ్బందికి సమాచారం అందించారు. వారు వానరాన్ని ఊరేగింపుగా తీసుకెళ్లి గ్రామశివారులో పూడ్చిపెట్టారు.

శ్రీసంతోషిమాత ఆలయంలో వారాహి పూజలు



పూజలు నిర్వహిస్తున్న మహిళలు

సూర్యాపేట : పట్టణంలోని శ్రీసంతోషిమాత ఆలయంలో ఆషాఢమాసంలో విశేషమైన శ్రీవారాహి నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా గురువారం 8వ రోజు ఉన్మత్త వారాహి దేవిగా అమ్మవారికి పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా దేవాలయం అర్చకులు బట్టారం వంశీకృష్ణశర్మ అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. నవరాత్రుల్లో విశేషంగా ప్రత్యేకంగా ఎరుపు పుష్పాలతో అర్చనలు చేపట్టారు. అనంతరం ఉన్మత్త వారాహి దేవి అమ్మవారి విశిష్టత భక్తులకు తెలియజేశారు. పూజల అనంతరం మహిళలు హారతులు ఇస్తూ అమ్మవారికి కీర్తిస్తూ పాటలు పాడారు. కార్యక్రమంలో ఆలయ అధ్యక్షుడు నూక వెంకటేశ్వంగుప్తా, ప్రధాన కార్యదర్శి బ్రాహ్మండ్లపల్లి మురళీధర్, కమిటీ సభ్యులు బజ్జూరి శ్రీనివాసు, దేవాలయ మేనేజర్ బచ్చు పురుషోత్తం, జలంధర్ భక్తులు పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి

నాగారం : సీజనల్ వ్యాధుల పట్ల విద్యార్థులు అప్రమత్తంగా ఉండాలని మండల వైద్యాధికారి డాక్టర్ నాగరాజు అన్నారు. గురువారం మండల పరిధిలోని పసునూర్ మోడల్‌స్కూల్‌లో విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ప్రతిఒక్కరూ వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు, పరిసరాల పరిశుభ్రత పాటించాలన్నారు. వర్షాకాలంలో ఇంటి పరిసరాలలో నీటి నిల్వలు లేకుండా చూసుకోవాలన్నారు. పరిసరాలలో నీరు నిల్వ ఉంటే దోమలు వ్యాప్తి చెందుతాయని, అవి కుట్టడంతో మలేరియా, డెంగీ, చికెన్‌గున్యా వంటి వ్యాధులు సోకుతాయన్నారు. వర్షాకాలంలో నీరు కలుషితం కావడంతో, కలుషితమైన ఆహారం పదార్థాలు, ఈగలు వాలిన ఆహార పదార్థాలు తినడంతో టైఫాయిడ్, నీళ్ల విరేచనాలు, బంక విరేచనాలు, కలరా సంభవించే ఆస్కారం ఉందన్నారు. ప్రతిఒక్కరూ వర్షకాలంలో పరిశుభ్రత పాటించాలని, వేడివేడి ఆహార పదార్థాలు తీసుకోవాలని, నీరు కాచి వడబోసి తాగాలని సూచించారు. కార్యక్రమంలో జిల్లా ఎపిడమాలజిస్ట్ డాక్టర్ సతీష్‌గౌడ్, డాక్టర్ శ్రావణ్‌కుమార్, సీహెచ్‌ఓ మాలోతు బిచ్చు నాయక్, ప్రిన్సిపాల్ చంద్రబాబు, సూపర్‌వైజర్ రామచంద్ర, వైద్యసిబ్బంది లక్ష్మీబాయి, సుమ, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.



సీజనల్ వ్యాధులపై విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న డాక్టర్ నాగరాజు

బీసీ వర్గీకరణ ప్రకారం ఎన్నికలు నిర్వహించాలి



స్వామిని సన్మానిస్తున్న బీసీ సంఘం నాయకులు

తిరుమలగిరి : స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీ వర్గీకరణ ప్రకారం ఎన్నికలు నిర్వహించాలని బీసీ ఫెడరేషన్ కులాల సమితి రాష్ట్ర ఉపాధ్యక్షుడు గోగుల స్వామి, రాష్ట్ర యూత్ ప్రధాన కార్యదర్శి, సూర్యాపేట జిల్లా అధ్యక్షుడు ఎల్సోజు నవీన్‌కుమార్ కోరారు. గురువారం మండల కేంద్రంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు న్యాయమైన ప్రాతినిధ్యం కల్పించాలంటే ఏ, బీ, సీ, డీ వర్గీకరణ ఆధారంగా కోటాను అమలు చేయాలన్నారు. ఈ నెల 24న బీసీ ఫెడరేషన్ కులాల సమితి ఆధ్వర్యంలో డాక్టర్స్ సేవా అవార్డుల కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమానికి సీఎం రేవంత్ రెడ్డి, పీసీసీ అధ్యక్షులు మహేష్‌కుమార్ హాజరవుతున్నట్లు తెలిపారు. సమావేశంలో నియోజకవర్గ అధ్యక్షుడు కె.ఉపేందర్, బాబూరావు, వెంకన్న, మహేష్, రమేష్, అమరేందర్ పాల్గొన్నారు.

గ్రామగ్రామాన ఎమ్మార్పీఎస్ జెండా ఎగరాలి

సూర్యాపేట : గ్రామగ్రామాన ఈ నెల 7న ఎమ్మార్పీఎస్ జెండా ఎగరాలని ఎంఎస్పీ జిల్లా అధ్యక్షుడు యాతాకుల రాజన్న అన్నారు. గురువారం మండలంలోని పిల్లలమర్రి గ్రామంలో ఎమ్మార్పీఎస్, ఎంఎస్పీ అనుబంధ సంఘాల జెండా గద్దె నిర్మాణానికి శంకుస్థాపన చేసి మాట్లాడారు. అణగారిన వర్గాలకు అండగా నిలిచే మందకృష్ణ మాదిగ 30ఏళ్లుగా ఎస్సీ వర్గీకరణ ధ్యేయంగా ఉద్యమాన్ని ముందుకు నడిపారని, ప్రతి పల్లెలో ప్రతి వార్డులో ఘనంగా ఎమ్మార్పీఎస్ జెండా పండగ నిర్వహించాలని కోరారు. కార్యక్రమంలో మాదిగ ఉద్యోగుల సమైక్య రాష్ట్ర కోశాధికారి చింత జాన్‌విల్సన్ మాదిగ, జిల్లా కళానేత గంట భిక్షపతి మాదిగ, ఎల్.జగన్మోహన్, చింత వెంకన్న, బొజ్జ సుమన్, నక్క సైదులు, చెరుకుపల్లి అర్జున్, శ్రీను, వెంకటేష్, రాజు పాల్గొన్నారు.



నినాదాలు చేస్తున్న ఎమ్మార్పీఎస్ నాయకులు

అమరుల ఆశయ సాధనకు ఉద్యమించాలి

ఆత్మకూర్ (ఎస్) : భూమి, భుక్తి విముక్తి కోసం పోరాడి ప్రజల కోసం ప్రాణాలర్పించిన అమరుల ఆశయ సాధనకు ప్రతిఒక్కరూ ఉద్యమించాలని సీపీఐ (ఎంఎల్) న్యూడెమోక్రసీ రాష్ట్ర అధికార ప్రతినిధి సాధినేని వెంకటేశ్వరరావు అన్నారు. గురువారం మండల పరిధిలోని తుమ్మల పెన్‌పహాడ్ గ్రామంలో నిర్వహించిన తెలంగాణ సాయుధ రైతాంగ పోరాటయోధుడు అలుగుబెల్లి వెంకటనరసయ్య మూడో వర్ధంతి సభలో ఆయన పాల్గొని మాట్లాడారు. నిజాం పాలనకు వ్యతిరేకంగా రైతు కూలీలను ఏకం చేసి పోరాడిన గడ్డ ఉమ్మడి నల్లగొండ జిల్లా అని అన్నారు. ఎందరో విప్లవోద్యమంలో ప్రజల పక్షాన నిలబడి తమ ప్రాణాలను తృణప్రాయంగా వదిలారని వారి ఆశయ సాధనకు అందరం ఉద్యమించాలని పిలుపునిచ్చారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కార్పొరేట్ సంస్థలకు కొమ్ముగాస్తు మావోయిస్టుల అణచివేత పేరుతో ఆదివాసీలను అడవి నుంచి వెళ్లగొట్టే ప్రయత్నం చేస్తున్నారని అన్నారు. కార్మిక కర్షకులకు వసతులు కల్పించలేని ప్రభుత్వాలు ఎమ్మెల్యేలకు, ఎంపీలకు వేలవేల జీతాలతో రాష్ట్ర ఖజానాను కొల్లగొడుతున్నాయని అన్నారు. విద్య వైద్యాన్ని అమ్ముతూ ప్రజలకు, ఉద్యోగులకు భద్రత లేకుండా చేస్తున్నారని అన్నారు. ఈ సందర్భంగా గ్రామంలో విప్లవోద్యమంలో అమరులైన 85మంది స్మారకస్థూపాన్ని ఆవిష్కరించారు. అంతకు ముందు గ్రామంలో భారీ ర్యాలీ నిర్వహించారు. సీపీఐ ఎంఎల్ జిల్లా కార్యదర్శి ఎం.డేవిడ్‌కుమార్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో రాష్ట్ర నాయకులు ఆవుల మధు, వి.కోటేశ్వరరావు, అలుగుబెల్లి వాణి వెంకటరెడ్డి, కుంట్ల ధర్మార్జున్, భద్రయ్య, కొప్పుల రంగారెడ్డి, కునుకుంట్ల సైదులు, గంట నాగయ్య, బొడ్డు శంకర్, కంచరపల్లి సైదులు, పోలేబోయిన కిరణ్, నల్లగొండ నాగయ్య, కంచర్ల నర్సక్క పాల్గొన్నారు.



సంస్మరణ సభలో మాట్లాడుతున్న పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి వెంకటేశ్వరరావు

సమస్యల పరిష్కారంలో డీటీఎఫ్ ముందంజ



మద్దిరాల : కుక్కడం పాఠశాలలో డీటీఎఫ్ సభ్యత్వం అందజేస్తున్న రాములు



తుంగతుర్తి : రావులపల్లి పాఠశాలలో..

మద్దిరాల : ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారంలో డీటీఎఫ్ (డెమొక్రటిక్ టీచర్ ఫెడరేషన్) ముందంజలో ఉటుందని ఆ సంఘం రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు రేపాక లింగయ్య అన్నారు. గురువారం మండలంలోని ఆయా గ్రామాల్లోని ప్రభుత్వ పాఠశాలలో నిర్వహించిన సంఘం సభ్యత్వ నమోదు కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. అవినీతికి తావులేకుండా ఉపాధ్యాయుల సమస్యలను డీటీఎఫ్ పరిష్కరిస్తుందన్నారు. ప్రభుత్వం విద్యారంగానికి అధిక నిధులను కేటాయించాలని కోరారు. కామన్ స్కూల్ విధానాన్ని అమలు చేయడంతోనే విద్యారంగ సమస్యలకు పరిష్కారమన్నారు. ఇంటిగ్రేటెడ్ పాఠశాలల ఏర్పాటుతో సమస్యలు తీవ్రం అయ్యే అవకాశం ఉందన్నారు. కార్యక్రమంలో సంఘం మండల అధ్యక్షుడు జిబిలికపల్లి రాములు, మండల కమిటీ సభ్యులు పులిగిల్ల సురేష్, ఆలకుంట్ల విజయ్, కట్టా ఉమేష్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

తుంగతుర్తి : ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరించడంలో డీటీఎఫ్ (డెమొక్రటిక్ టీచర్స్ ఫెడరేషన్) ముందంజలో ఉంటుందని ఆ సంఘం మండల నాయకులు వెంకటమల్లు అన్నారు. గురువారం మండల పరిధిలోని రావులపల్లి జెడ్పీహెచ్ఎస్ పాఠశాలలో సభ్యత్వ నమోదు కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. ఉపాధ్యాయులకు సమస్యలు లేకుండా డైరెక్టర్ స్కూల్ ఎడ్యుకేషన్ చూడాలన్నారు. ఉపాధ్యాయులు ఎలాంటి సమస్యలు లేనప్పుడు అంకితభావంతో పనిచేసి విద్యార్థులకు న్యాయం చేస్తారని అన్నారు. సభ్యత్వ నమోదు కార్యక్రమంలో నాయకులు నవీన్, వెంకన్న, మధు తదితరులు పాల్గొన్నారు.

తాగునీరు అందించాలని ఆందోళన



నిరసన వ్యక్తం చేస్తున్న కాలనీవాసులు

తుంగతుర్తి : మండల కేంద్రంలోని ఎస్సీకాలనీలో పది రోజులుగా తాగునీరు రాక తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని ఆ కాలనీ మహిళలు గురువారం స్థానికంగా ఖాళీ బిందెలతో నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా పలువురు మహిళలు మాట్లాడుతూ.. పది రోజులుగా నీళ్లు రాకపోవడంతో ఆటోలు, ఇతర వాహనాలలో బోర్ల దగ్గర నుంచి నీళ్లు తెచ్చుకుంటున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. కొన్ని నెలల నుంచి ఇదే సమస్య ఉన్న అధికారులు శాశ్వత పరిష్కారం చూపడం లేదన్నారు. గ్రామపంచాయతీ కార్యదర్శికి ఎన్నిసార్లు చెప్పినా పట్టించుకోవడంలేదన్నారు. ఇప్పటికైనా జిల్లా అధికారులు స్పందించి సమస్యను పరిష్కరించాలని కోరారు. కార్యక్రమంలో కాలనీ మహిళలు బొంకురి వీరసోవమ్మ, బొంకురి సునీత, బొంకురి వెంకటమ్మ, ఆకారం ముత్తమ్మ, తడకమల్ల నరసమ్మ, బాలమ్మ, వెంకటమ్మ, బేబీ, వనిత, తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులను మోసం చేస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వం

కోదాడరూరల్ : పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయింబర్స్‌మెంట్ విడుదల చేయకుండా కాంగ్రెస్ ప్రభుత్వం ఇంజనీరింగ్, పీజీ విద్యార్థులను మోసం చేస్తోందని పీడీఎస్‌యూ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం.చందర్ రావు, పీవైఎల్ ప్రధాన కార్యదర్శి డి.రవి ఆరోపించారు. పెండింగ్ ఫీజు రీయింబర్స్‌మెంట్‌ను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ గురువారం కోదాడ పట్టణంలో ఇంజనీరింగ్, పీజీ, ఫార్మసీ విద్యార్థులతో కలిసి భారీ ర్యాలీ నిర్వహించారు. అనంతరం ఆర్డీఓ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించి ఆర్డీఓకు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో ఉదయ్, పులి రాఖీ, వేణు, ఉమేష్, యశ్వంత్, కల్యాణ్, రాము, రమ్య, శైలజ, స్పందన, సులోచన, సాహితి, శ్రీదేవి ఉన్నారు.